క్లుప్తంగా

చెన్నాయిపల్లి చేరుకున్న నల్లచెరువు సాగునీరు



చెన్నాయిపల్లి పంట పొలాలకు సాగునీరు

సాక్షి ఎఫెక్ట్..

చిన్నశంకరంపేట(మెదక్): చెన్నాయిపల్లి రైతుల పంట పొలాలకు నల్లచెరువు సాగునీరు చేరింది. బుధవారం 'సాక్షి' పత్రికలో కాల్వకు బుంగ.. రైతులకు బెంగ అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఇరిగేషన్ అధికారులు కాల్వ బుంగలను కవర్ చేసేందుకు టాపర్ల ఏర్పాటుకు ముందుకు వచ్చారు. టాపర్లకు అయ్యే ఖర్చులు భరించి టాపర్లను ఏర్పాటు చేయడంతో బుధవారం చెన్నాయిపల్లి గ్రామంలోని రైతుల పంట పొలాల వద్దకు నల్లచెరువు సాగునీరు చేరింది. ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్‌రావు ప్రత్యేక చొరవ చూపారు. ఇరిగేషన్ ఏఈ ప్రదీప్‌రెడ్డి, ఎస్ఐ నారాయణగౌడ్, ఆర్ఐ చంద్రశేఖర్‌లకు అధికారులకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

రామాయంపేట(మెదక్): పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో బుధవారం ఏబీవీపీ కార్యకర్తలు రాష్ట్రీయ కళామంచ్ సింగిడి - 2024 పోస్టర్లను ఆవిష్కరించారు. ఈనెల 20, 21 తేదీల్లో హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రశాంత్ తెలిపారు. కార్యక్రమంలో సంఘం ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

నల్లపోచమ్మ హుండీ ఆదాయం రూ.5.48 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్లపోచమ్మ ఆలయం హుండీ ఆదాయం రూ.5.48 లక్షలు వచ్చినట్లు ఈఓ మోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆలయం వద్ద దేవాదాయ శాఖ ఈఓ మోహన్‌రెడ్డి, జహీరాబాద్ ఈఓ శివ రుద్రప్ప ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం, జాతరతో పాటు, రెండున్నర నెలలకు సంబంధించి అధికారులు, పోలీసుల సమక్షంలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. వచ్చిన ఆదాయాన్ని దేవాదాయ శాఖ బ్యాంక్ ఖాతాలో జమ చేస్తామని ఈఓ తెలిపారు. కార్యక్రమంలో అధికారులు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రాములు, పర్వతాలు, మహేందర్, సునీత, ప్రభాకర్ చారి, లక్ష్మీనారాయణ గౌడ్, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడిగా బుచ్చేష్



నర్సాపూర్: బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నర్సాపూర్ మున్సిపాలిటీ పదో వార్డు కౌన్సిలర్ బుచ్చేష్‌యాదవ్‌ను నియమిస్తూ బుధవారం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా బుచ్చేష్ యాదవ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో తనను జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించినందుకు పార్టీ బాధ్యులకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలి



విజ్ఞానయాత్రలో విద్యార్థులు

శివ్వంపేట(నర్సాపూర్): సైన్స్‌పై ప్రతీ విద్యార్థి అవగాహన పెంచుకోవాలని శివ్వంపేట ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బాలచంద్రం అన్నారు. పాఠశాలకు చెందిన 250 మంది విద్యార్థులు బుధవారం సైన్స్ విహారయాత్రకు ప్రత్యేక బస్సులో హైదరాబాద్ తరలివెళ్లారు. బిర్లా సైన్స్ మ్యూజియం, సాలార్జంగ్ మ్యూజియం, చిల్డ్రన్స్ పార్కులను సందర్శించారు.

ఆస్పత్రిలో తాగునీటి సమస్య

- మరుగుదొడ్లలోనూ అంతంతే
- ఇబ్బందులు పడుతున్న రోగులు



మాతా, శిశుఆస్పత్రి మెదక్

మెదక్‌జోన్: పట్టణ పరిధిలోని పిల్లికోటాల్ శివారులోని మాతా, శిశు ఆస్పత్రిలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. నిత్యం వందలాది మంది నీటి వసతి లేక బయట నుంచి తాగునీటిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

మెదక్ మాతా, శిశు ఆరోగ్యకేంద్రానికి నిత్యం వందలాది మంది వస్తుంటారు. ఇందులో ప్రధానంగా గర్భిణులు, ప్రసూతి, పిల్లల చికిత్స నిమిత్తం వస్తుంటారు. ఈ ఆస్పత్రికి మెదక్ జిల్లాతో పాటు కామారెడ్డి జిల్లాల నుంచి సైతం ఇక్కడికి వస్తుంటారు. నిత్యం ఓపీ పేషెంట్లు 15 వందల వరకు వస్తారని ఆస్పత్రి వైద్యులు చెబుతున్నారు. ఈ దావాఖానలో నెలకు 350 నుంచి 420 డెలివరీలు అవుతుంటాయి. కాగా డెలివరీలకు వచ్చే వారు 5 రోజుల నుంచి 9 రోజుల పాటు ఆస్పత్రిలో ఉండాల్సి ఉంటుంది. ఈ నేథప్యంలో పేషెంట్‌కు సహాయకులుగా ఒక్కో వ్యక్తి వద్ద ఇద్దరు ఉంటాల్సి ఉంటుంది. దీంతో ఆస్పత్రిలో ఎప్పుడు వందలాది మందిదో బిజీబిజీగా ఉంటుంది. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఇళ్ల నుంచి భోజనాలు సైతం తెచ్చుకుంటారు. ఆస్పత్రిలో తాగునీరు లేకపోవటంతో బయట హోటల్లో నుంచి నీటిని కొనుగోలు చేయాల్సి వస్తుందని రోగులది, వారి బంధువులది అంతే కాకుండా మరుగుదొడ్లలో సైతం నీటి సరిగ్గా రావడం లేదని వాపోతున్నారు.



ఆస్పత్రికి వాటర్‌బాటిళ్లతో వచ్చిన మహిళలు

నీటిని కొనుకుంటున్నాం..



ఆస్పత్రిలో తాగునీరు లేక బయట నుంచి కొనుకుంటున్నాం. ఒక్కో బాటిల్‌కు రూ. 20 చెల్లించి కొనాల్సి వస్తోంది. తాగునీటికే రోజుకు వంద వరకు ఖర్చుపెడుతున్నాం. అస్సలే ఎండాకాలం కావటంతో తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నాం.
– మాణమ్మ, పోచారం కామారెడ్డి జిల్లా

సమస్యను పరిష్కరిస్తాం

మాతా, శిశు ఆస్పత్రిలో తాగునీటి కోసం భగీరథ నీటిని ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు నివేదించాం. వెంటనే తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం.
– పీసీ శేఖర్ డీసీహెచ్ మెదక్

పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణ మహోత్సవం



వెంకటపూర్ కె గ్రామంలో పెద్దమ్మ కల్యాణోత్సవంలో ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని వెంకటపూర్ కె. గ్రామంలో బుధవారం ముదిరాజు కులస్తుల ఆధ్వర్యంలో పెద్దమ పెద్దిరాజుల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు గ్రామంలో పెద్దమ్మ పెద్దిరాజుల ఆలయ ఐదవ వార్షికోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పెద్దమ్మతల్లికి షోడశోపచార పూజ, మహా మంగళ హారతి, అనంతరం పెద్దమ్మ కల్యాణం, ఋత్విక్ సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా పురోహితులు రవిచంద్రశర్మ మాట్లాడుతూ.. అమ్మవారి కృపతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. అనంతరం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి హాజరయ్యారు. సాయంత్రం సమయంలో గ్రామంలో పెద్దమ్మతల్లికి బోనాలు తీశారు. కార్యక్రమంలో ముదిరాజు కులస్తులు దయాకర్, కాస రాజేశం, అక్కల పోచయ్య, కిష్టయ్య, సత్యం వెంకట్, గణేశ్, నర్సింలు, బాలయ్య, బైండ్ల నందు, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య సేవలు మరువలేం



తూప్రాన్‌లో దొడ్డి కొమరయ్య జయంతి వేడుకల్లో నాయకులు

తూప్రాన్: పట్టణ కేంద్రంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య 97వ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. కొమురయ్య జీవిత ఆశయాలను భవిష్యత్ తరానికి అందించాల్సిన భాధ్యత ప్రభుత్వానికి ఉందన్నారు. కురుమ సంఘం మండల అధ్యక్షులు బండెల నరేశ్, శ్రీశైలం, మున్సిపల్ యాదవ సంఘం అధ్యక్షులు తుమ్మెట శ్రీనివాస్ యాదవ్, మెదక్ జిల్లా యాదవ హక్కుల పోరాట సమితి అధ్యక్షులు వెంకటేశ్ యాదవ్, సాయికుమార్, బాలకృష్ణ, మల్లికార్జున్‌గౌడ్, ఆంజనేయులు, గడ్డం వెంకటేష్, భిక్షపతి, రమేశ్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

యువత మద్దతు బీజేపీకే



తూప్రాన్‌లో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు



అల్లాదుర్గంలో బీజేపీ ప్రచార రథం ప్రారంభిస్తున్న నాయకులు

అల్లాదుర్గం(మెదక్): పార్లమెంట్ ఎన్నికల్లో యువత మద్దతు నరేంద్ర మోదీ నాయకత్వంలోనే బీజేపీకే ఉందని బీజేపీ మండలాధ్యక్షుడు యాదగిరి అన్నారు. బుధవారం అల్లాదుర్గంలో జెండా ఊపి బీజేపీ ప్రచారరథం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోని యువత మూడోసారి నరేంద్రమోదీనే ప్రధాన మంత్రి చేయాలని నిర్ణయించుకున్నారని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ భారీ మెజార్టీతో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు రాములు, రవి బేతయ్య, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఇంటింటా ప్రచారం

తూప్రాన్: పట్టణ కేంద్రంలో బీజేపీ మున్సిపల్ శాఖ అధ్యక్షుడు భూమన్నగారి జానకిరామ్‌గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం బీజేపీ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని, ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. కమలం పువ్వు గుర్తుకే ఓటు వేయాలని కార్యకర్తలు ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో ఈ పార్టీ నాయకులు మహేశ్‌గౌడ్, బద్రీనాథ్ నాగరాజు, మధుసూదన్, ప్రవీణ్, సాయి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

శేరిపల్లిలో పెద్దమ్మ ఆలయ ఉత్సవాల ప్రారంభం

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలంలోని శేరిపల్లి గ్రామంలో వెలసిన పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. నాలుగు రోజుల పాటు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నారు. గ్రామదేవతకు బోనాలు తీశారు. గురువారం పెద్దమ్మతల్లి ఆలయంలో గణపతిపూజ, అమ్మవారికి అభిషేకం, హోమం నిర్వహించనున్నారు. 5న అమ్మవారి కల్యాణోత్సవం, అన్నప్రసాద వితరణ, అమ్మవారికి బోనం తీయనున్నారు. 6న బండ్లు తిరుగుట కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ముదిరాజ్ సంఘం నాయకులు తెలిపారు. ఆలయ ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలి

నర్సాపూర్: పార్లమెంట్ ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలని నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి చెప్పారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఇతర పోలింగ్ అధికారులు(ఓపీఓలు) సైతం పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలని చెప్పారు. తమ కార్యాలయంతో పాటు డివిజన్‌లోని అన్ని మండల తహసీల్దార్ కార్యాలయాలలో అన్ని వివరాలతో ఫారం-12ను ఈనెల 5లోపు అందజేయాలని ఆయన సూచించారు. కాగా ఎన్నికల విధులకు గైర్హాజరైతే ప్రజా ప్రాతినిధ్య చట్టం - 1951, సెక్షన్ 134 ప్రకారం ఎన్నికల సంఘం, జిల్లా కలెక్టర్ కఠిన చర్యలు తీసుకుంటారని ఆయన వివరించారు.

కొంతన్‌పల్లిలో వ్యక్తి అదృశ్యం



కృష్ణ

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని కొంతన్‌పల్లిలో వ్యక్తి అదృశ్యమైనట్లు ఎస్ఐ మహిపాల్ రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన అరికెల కృష్ణ భార్యతో గొడవపడి మంగళవారం ఉదయం ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా.. ఆచూకీ లభించకపోవడంతో కృష్ణ భార్య నవనీత బుధవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

కాంగ్రెస్‌లోకి చేరికలు

మెదక్‌జోన్: పట్టణానికి చెందిన ముగ్గురు బీఆర్ఎస్ కౌన్సిలర్లతో పాటు మరి కొంతమంది ముఖ్యనేతలు బుధవారం మైనంపల్లి హన్మంతరావు నివాసంలో కాంగ్రెస్‌లో చేరారు. ఇందులో కౌన్సిలర్లు జయశ్రీ, మేడి కల్యాణి, వసంతరాజ్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు గంగాధర్, నాయకులు దుర్గాప్రసాద్, మధుసుదన్‌రావు, స్టీఫెన్ ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త ప్రతాప్‌రెడ్డి

కొల్చారం(నర్సాపూర్): ప్రకృతి వ్యవసాయం ద్వారా పెట్టుబడి తగ్గి, అధిక దిగుబడి సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం(తునికి) శాస్త్రవేత్తలు సూచించారు. బుధవారం మండలంలోని సంగాయిపేట గ్రామంలోని రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు హాజరైన శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. అధిక మోతాదులో రసాయన ఎరువులు, మందుల వాడొద్దన్నారు. సేంద్రియ ఎరువులును వాడితే అధిక దిగుబడి వస్తుందన్నారు. ఎకరాకు 5 టన్నుల సేంద్రియ ఎరువులను వాడాలని, పంట మార్పిడి తప్పనిసరి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రవికుమార్, ప్రతాప్‌రెడ్డి, సంఘం అధ్యక్షుడు జితేందర్ రెడ్డి, ఎంపీపీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, ఏఈఓలు నిరోషా, ప్రతిభ, అంబిక, వినీత, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

15 నుంచి సీతారామస్వామి ఉత్సవాలు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి

తూప్రాన్: పట్టణంలోని రామాలయంలో ఈ నెల 15 నుంచి సీతారామస్వామి ఉత్సవాలు నిర్వహించేందుకు మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి అధ్యక్షతన బుధవారం రామాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పట్టణంలోని పుర ప్రముఖులు హాజరయ్యారు. ఉత్సవాల నిర్వహణపై చర్చించారు. ఈ సందర్భంగా పండితులు ఉదయ్‌కుమార్ శర్మ ఉత్సవాల నిర్వహణ తేదీలను ఖరారు చేశారు. 15న గణపతి పూజ, అంకురార్పణ, 16న ధ్వజారోహణం, 17న శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవం, 24 రథోత్సవం నిర్వహించేందుకు సమావేశంలో చర్చించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, శ్రీశైలంగౌడ్, నారాయణగుప్తా, నాయకులు రవీందర్‌గుప్తా, తాటి విఠల్, దుర్గరాజు, రవీందర్, నర్సోజీ, శ్రీనివాస్‌చారి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి



రామాయంపేట(మెదక్): పనులు పర్యవేక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్ దేవేందర్



చిలప్‌చెడ్‌లో కార్యదర్శులతో మాట్లాడుతున్న డీఎల్పీఓ యాదయ్య

చిలప్‌చెడ్(నర్సాపూర్): గ్రామాల్లో తాగు నీటి సమస్య లేకుండా చూడాలని డీఎల్పీఓ యాదయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రం చిలప్‌చెడ్‌లోని ఎంపీడీఓ కార్యాయలంలో ఆయన పంచాయతీ కార్యదర్శులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశుద్ధ్యం, తాగు నీటి సౌకర్యం వందశాతం ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆనంద్, ఎంపీఓ శరత్‌రెడ్డి, ఏపీఓ శ్యామ్ పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

రామాయంపేట(మెదక్): పట్టణంలోని కేసీఆర్ కాలనీ (డబుల్ బెడ్రూం)లో నెలకొన్న నీటి ఎద్దడి పరిష్కారం దిశగా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా అదనంగా పైప్‌లైన్ నిర్మించి రెండు బోర్ల ద్వారా సంప్‌లోకి నీరు వదులుతున్నారు. కాలనీలో నీటి ఎద్దడి సమస్యను పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్ పేర్కొన్నారు. చైర్మన్‌తోపాటు కమిషనర్ దేవేందర్ పనులను పర్యవేక్షించారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ



నత్తయ్యపల్లిలో ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు



నిజాంపేట(మెదక్): నందిగామలో ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

నర్సాపూర్ రూరల్: ప్రభుత్వ ఆదేశాల మేరకు జాతీయ ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు కూలీలకు బుధవారం కాగజ్ మద్దూర్, నత్నయ్యపల్లి, కొండాపూర్ తదితర గ్రామాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నందిగామ గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనుల్లో పనిచేసే కూలీలకు ఎండ వేడి తట్టుకునేందుకు గ్రామ పంచాయతీ కార్యదిర్శ ఆరిఫ్ హుస్సేన్ ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ ప్రేమలత, ఆశ వర్కర్ గౌరి, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

అర్హత గల బాధితులకు ఉచిత న్యాయం



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ లక్ష్మీశారద

హవేళిఘణాపూర్(మెదక్): న్యాయ సేవా సమితి ఆధ్వర్యంలో కేసును రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా వాదించడం జరుగుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ లక్ష్మీశారద అన్నారు. మంగళవారం మండల పరిధిలోని నాగాపూర్ గ్రామంలో చట్టాలు, నకిలీ విత్తనాలు, ఆన్‌లైన్ మోసాలు, రూ.3లక్షల ఆదాయం ఉన్న వారికి ఉచిత న్యాయ సేవలందించడంపై అవగాహన కల్పించారు. ప్రజలు ఏవైనా ఇబ్బందులుంటే న్యాయ సేవా సంస్థను సంప్రదిస్తే తగు సలహాలు, సూచనలు ఇచ్చి బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. అలాగే గతంలో కోర్టు కేసులు, కుటుంబ తగాదాలు, భార్యభర్తల గొడవపడి కేసులు ఉన్న వారు లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలన్నారు. లేనిపోని గొడవలు పడి కోర్టుల చుట్టూ తిరుగకుండా డబ్బు, సమయం వృథా చేసుకోకుండా ఇరువురు ఒప్పందం కుదుర్చుకుంటే కేసులు పరిష్కరించేంతుకు తాము సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు సిద్దాగౌడ్, కరుణాకర్, నందునాయక్, ఎఎస్ఐ రాజు, షీ టీమ్ సభ్యులు విజయ్, గ్రామస్తులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **కాంగ్రెస్‌లో చేరికలు**

నర్సాపూర్: సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోని పలు గ్రామాల బీఆర్ఎస్ నాయకులు నర్సాపూర్‌లో పార్టీ జిల్లా తాత్కాలిక అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుహాసినిరెడ్డి, శ్రీనివాస్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని నాయిని జలాల్‌పూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు బుధవారం కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మల్లేశం గౌడ్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వీరికి మల్లేశం కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో సీనియర్ నాయకుడు రాయన్న, మాజీ ఉపసర్పంచ్ రాములు, వెంకట నర్సింలు తదితరులు ఉన్నారు.

◆ **ఆటోలో మూడు సిలిండర్లు మాయం**

చిన్నశంకరంపేట(మెదక్): గ్యాస్ సిలిండర్ల ఆటోను ఇంటి ఎదుట పార్క్‌చేసి భోజనం చేసివచ్చేలోపు మూడు గ్యాస్‌సిలిండర్లు మాయమైన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన మహ్మద్ ఖలీల్ చేగుంట భారత్ గ్యాస్ ఏజేన్సీలో డెలివరి భాయ్‌గా పనిచేస్తాడు. మంగళవారం గ్యాస్‌సిలిండర్ల ఆటోను తన ఇంటి ఎదుట నిలిపి ఇంట్లోకి తినడానికి వెళ్లాడు. తిరిగి వచ్చి చూడగా మూడు గ్యాస్‌సిలిండర్‌లో మాయం అయ్యాయి. ఈ విషయంపై బుధవారం పోలీస్‌లకు ఫిర్యాదు చేయగా.. కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపారు.

◆ **అక్రమాలు చేసింది బీఆర్ఎస్ నాయకులే**

శివ్వంపేట(నర్సాపూర్): దొంతి గ్రామంలో ఇసుక, మట్టి అక్రమ దందాలకు చేసింది గ్రామ బీఆర్ఎస్ నాయకులే అని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. బుధవారం గ్రామంలో కాంగ్రెస్ నాయకులు బానగారి శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, చుక్క శ్రీనివాస్, తదితరులు గ్రామస్తులతో కలిసి మాట్లాడుతూ.. గ్రామ కుందలమ్మ చెరువు కట్టపైన గ్రామస్తులందరం కలిసి దాత సాయంతో కట్ట మైసమ్మ ఆలయ నిర్మాణం చేసేందుకు పనులు ప్రారంభించినట్లు చెప్పారు. ఆలయం నిర్మాణానికి ఇసుక తీస్తే ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు.

◆ **పోలీస్ కవాతు**

చిన్నశంకరంపేట(మెదక్): పార్లమెంట్ ఎన్నికలు సమీస్తున్న నేపథ్యంలో మండల కేంద్రంతో పాటు మడూర్, గజగట్లపల్లి గ్రామాల్లో పారా మిలటరీ బలగాలతో పోలీస్ కవాతు నిర్వహించారు. బుధవారం ఈ సందర్భంగా ఎస్ఐ నారాయణగౌడ్ మాట్లాడుతూ.. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎస్పీ బాలస్వామి ఆదేశాలతో పారా మిలటరీ బలగాలతో కవాతు నిర్వహించినట్లు తెలిపారు.

◆ **మోదీని మళ్లీ ప్రధాని చేయాలి**



రామాయంపేట(మెదక్): మోదీని మళ్లీ ప్రధాని చేయాలని పార్టీ కార్యకర్తలు బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని బీసీ కాలనీ, ఎల్లమ్మ కాలనీ, రాజేంద్రనగర్‌లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇళ్లు, వ్యాపార సముదాయాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. ఎంపీ ఎన్నికల్లో బీజేపీకి ఓటువేసి మరోసారి మోదీని ప్రధాని చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, సీనియర్ నాయకులు రాములు, పట్టణ అధ్యక్షుడు భానుచందర్, ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చింతల శేఖర్, పట్టణ ప్రధాన కార్యదర్శి అవినాష్‌రెడ్డి, కన్నయ్య, సతీశ్ రావు, తదితరులు పాల్గొన్నారు.

◆ **నియామకం**

కొల్చారం(నర్సాపూర్): బీజేపీ జిల్లా కార్యదర్శిగా మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన సామల యాదగిరి నియామకమనట్లు మండలాధ్యక్షుడు దయాకర్ గౌడ్ బుధవారం ఓ ప్రకటన తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ యాదగిరికి నియామకపత్రం అందజేశారన్నారు.

◆ **మద్యం పట్టివేత**

చేగుంట(తూప్రాన్): కిరాణ షాపులో అక్రమంగా విక్రయిస్తున్న మద్యం పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాలరాజు తెలిపారు. చేగుంట శివారులోని వెంకటేశ్వర పరిశ్రమ సమీపంలో కిరాణ షాపులో రాజేందర్‌గౌడ్ మద్యం విక్రయిస్తున్నాడు. నమ్మదగిన సమాచారం మేరకు కిరాణ షాపుపై దాడి చేసి 58 బాటిళ్ల మద్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

◆ **ఘనంగా ఎల్లమ్మ బోనాల ఊరేగింపు**



నర్సాపూర్ రూరల్: మండలంలోని తుజాల్‌పూర్‌లో మూడు రోజులుగా కొనసాగుతున్న మల్లికార్జున స్వామి ఉత్సవాలు బుధవారం బోనాల ఊరేగింపుతో ముగిశాయి. ఎల్లమ్మకు మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి బోనాలను ఊరేగించి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.